నిధులున్నా ప్రారంభంకాని పనులు

- 2018లో రూ.50 లక్షలు మంజూరు
- పనులు చేపట్టకపోవడంతో కాంట్రాక్టర్ మార్పు
- అయినా ముందుకు సాగని మునుగోడు -చండూరు రోడ్డు డ్రెయిన్ పనులు


చండూరు-మునుగోడు ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

మునుగోడు : మండల కేంద్రంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రెయినేజీల నిర్మాణానికి 2018లో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అప్పటి ప్రజాప్రతినిధులు వెంటనే పనులు మొదలుపెట్టేందుకు ప్రారంభోత్సవాలు చేశారు. కానీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం మునుగోడు-చౌటుప్పల్ రోడ్డుకు ఇరువైపుల మాత్రమే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. మునుగోడు-చండూరు రోడ్డులోని కాల్వ పనులను నేటికీ మొదలుపెట్టలేదు. దీంతో ప్రజల ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరంతా రోడ్డుపై పారుతోంది. ఏదైనా పెద్ద వర్షం వచ్చినప్పుడు నీరు మొత్తం రోడ్డుపై నిలుస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

నాన్‌ప్లాన్ నిధుల నుంచి రూ. 50 లక్షలు మంజూరు

2018 సెప్టెంబర్‌లో మండల కేంద్రంలో మునుగోడు-చండూరు రోడ్డుకు ఇరువైపులా 500 మీటర్ల డ్రెయినేజీ నిర్మాణానికి ప్రభుత్వం నాన్‌ప్లాన్ నిధుల నుంచి రూ. 50 లక్షలు మంజూరు చేసింది. ఆ పనులు చేసేందుకు అధికారులు టెండర్ పిలువగా పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టకుండా వదిలేశాడు. దీంతో అధికారులు మరొక కాంట్రాక్టర్ కోసం రెండు, మూడుమార్లు టెండర్లు పిలిచారు. గత జూన్ మాసంలో నూతన కాంట్రాక్టర్ పనులు దక్కించుకుని వెంటనే పనులు ప్రారంభించేందుకు ఇసుకను డంప్ చేసుకున్నాడు. కానీ నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో డ్రెయినేజీ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరుచేసిన నిధులు నిరుపయోగంగా అలాగే ఉన్నాయి.

నీట మునుగుతున్న నివాస గృహాలు

మండల కేంద్రంలో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షం కురిసినప్పుడు రోడ్డుపై భాగంలోనుంచి వచ్చిన వరద నీరంతా రోడ్డు కింది భాగంలోని నివాస గృహాల మధ్య నిలుస్తోంది. డ్రెయినేజీలు నిర్మించినట్లయితే నీరు కాల్వ ద్వారా వాగులోకి వెళ్లేది. ఇకనైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని మంజూరైన నిధులతో మురికి కాల్వల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని మండల కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



చండూరు రోడ్డులో మురి కి కాల్వ నిర్మించాలని అధికారులకు పదేపదే చెబుతున్నా పట్టించుకోవడం లేదు. పనులు ప్రారంభించకపోతే ఆందోళనలు చేపడుతాం. కాల్వలు నిర్మించకపోవడంతో ఇళ్లలో వినియోగించిన నీరు రోడ్లపై పారుతోంది. అంతేకాకుండా వర్షపు నీరు రోడ్డు కింది భాగంలోని ఇళ్లకు వెళ్లి ఆ ఇళ్లు నీట మునుగుతున్నాయి.

– పందుల భాస్కర్, మాజీ ఎంపీటీసీ

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

2018లో నిధులు మంజూరైతే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయకుండా వదిలేశాడు. తిరిగి టెండర్ పిలువగా జూన్‌లో ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. పనులు ప్రారంభించేందుకు ఇసుకను సైతం సిద్ధం చేసుకున్నాడు. మరో వారం, పది రోజుల్లో పనులు ప్రారంభించి కాల్వ నిర్మాణం పూర్తి చేయిస్తాం. – శిరీష్, ఆర్‌అండ్‌బీ జేఈ

గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ పెద్దపీట


నకిరేకల్ : మోదినిగూడెంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశామని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలో రూ.2 కోట్లతో పీఏసీఎస్ కార్యాలయ భవనం ప్రహరీ పనులు, మోదినిగూడెంలో రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం, రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతో నేడు పల్లెలన్నీ ప్రగతి పథంలో ఉన్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేసే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహిందర్ రెడ్డి, మోదినిగూడెం, గోరెంకలపల్లి మంగళపల్లి సర్పంచులు పడాల సైదులు, జానయ్య, ప్రగడపు నవీన్‌రావు, నాయకులు వలిశెట్టి శ్రీనివాస్, పీర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు విడుదల

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు మండలాల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల నూతన భవనాల నిర్మాణం కోసం రూ.4 కోట్లు విడుదల చేయించానని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పంచాయతీల్లో భవనాలకు, శిథిలావస్థకు చేరిన చోట కొత్త భవనాలు నిర్మించడానికి ఒక్కో భవనానికి రూ. 20 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. తిప్పర్తి మండలంలోని గోదారిగూడెం, మామిడాల, గడ్డికొండారం, కంకణాలపల్లి, జంగారెడ్డిగూడెం, యాపలగూడెం, వెంకటాద్రిపాలెం, సోమోరిగూడెం గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలకు నిర్మిస్తామని తెలిపారు. అదేవిధంగా నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల, జి.కె. అన్నారం, తొరగల్, ఖాజీరామారం, కనగల్ మండలంలోని తేలకంటిగూడెం, తుర్కపల్లి, బచ్చన్నగూడెం, శాబ్దుల్లాపురం, చర్లగౌరారం, తిమ్మన్నగూడెం, బాబాసాయిగూడెం, ఏమిరెడ్డిగూడెం గ్రామాల పంచాయతీ భవనాలకు నిధులు విడుదలయ్యాయని అన్నారు.

క్లుప్తంగా

నార్కట్‌పల్లి తహసీల్దార్‌గా బి.పద్మ



నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి నూతన తహసీల్దార్‌గా బి. పద్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెన్‌పహాడ్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించిన పద్మ పదోన్నతిపై నార్కట్‌పల్లి తహసీల్దార్‌గా విచ్చేశారు. ఇప్పటివరకు నార్కట్‌పల్లిలో విధులు నిర్వర్తించిన తహసీల్దార్ కార్తిక్‌కు పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లారు.

తిప్పర్తి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శివశంకర్

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మాడ్గులపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.శివశంకర్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 12న సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీ అయిన ఎం.తిరుమలరావును తిప్పర్తి తహసీల్దార్‌గా నియమించగా ఆయన బాధ్యతలు స్వీకరించలేదు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ బి. శ్రీకాంత్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. దీంతో రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో శివ శంకర్‌ను తిప్పర్తి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా సత్తయ్య

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో కల్లుగీత సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నికున్నారు. సంఘం అధ్యక్షుడిగా అయితగోని సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా కుక్కడపు సైదులు, కార్యదర్శిగా కారింగుల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొట్టం దగ్ధం

చండూరు : మండలంలోని గుండ్రపల్లిలో ఓ పశువుల కొట్టం దగ్ధమై ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రపల్లి సర్పంచ్ తీగల సుభాష్ శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఊరు నుంచి తన వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లేసరికి కొట్టంలో నుంచి మంటలు వస్తున్నాయి. ఎంత ప్రయత్నం చేసినా మంటలు ఆరలేదు. మందు బస్తాలు, రైతు వేదికు సంబంధించిన సామగ్రి, వ్యవసాయ పనిముట్లు పూర్తిగా కాలి బూడిదైనట్ల బాధితుడు వివరించారు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని అన్నారు.

దుకాణానికి నిప్పు

శాలిగౌరారం : ఆకారం గ్రామానికి చెందిన వలిశెట్టి సత్యనారాయణ తన ఇంట్లో కిరాణ దుకాణాన్ని నడుపుతున్నాడు. గురువారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంట్లో నిద్రించాడు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటిన తర్వాత దుకాణం షట్టర్ కింద నుంచి పెట్రోల్‌ను దు కాణం లోపలికి పోసి నిప్పంటిచారు. దీంతో దుకాణంలోని వస్తువులు కాలిబూడిదయ్యా యి. తెల్లవారుజామున వచ్చి చూసేసరికి దుకా ణం నుంచి పొగలు వస్తుండడంతో కేకలు వే యగా చుట్టపక్కల వారు వచ్చి మంటలను ఆ ర్పివేశారు. సుమారు రూ.20 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు.

విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న కోడి వెంకన్న

చండూరు : హైదరాబాద్‌లో సోచ్ మేనేజ్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్న అంధులు, అనాథల, వృద్ధాశ్రమానికి స్థానిక సన్‌షైన్ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం సహకారంతో సేకరించిన విరాళం రూ 1,16,000 విలువ గల చెక్కును షైన్ పాఠశాల కరెస్పాడెంట్ కోడి వెంకన్న అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కోడి సుష్మ, ప్రిన్సిపాల్ రవికాంత్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

కనగల్ : సమగ్ర శిక్షాలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు సంతోష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామన్నారు. ఆయన వెంట మంజుల, పగిడిపాటి ప్రవీణ్, ఆదిమల్ల సంపూర్ణ, గురిజ మంజుల, ముచ్చపోతుల లక్ష్మీ, ఎండీ రఫీ, సతీష్, సుజాత, జానీ, యాదమ్మ తదితరులు ఉన్నారు.

పనుల పరిశీలన

కనగల్ : మండల కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం జిల్లా పరిషత్ నిధులు రూ.1.56 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించాడు. శుక్రవారం డీఈ నాగయ్యతో కలిసి పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట పీఆర్‌ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీదే అధికారం


మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఖమ్మంలో జరిగే సభకు వెళ్తున్న ఆయన నకిరేకల్‌లో శుక్రవారం కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ మండల, పట్టణ కమిటీ సభ్యులు కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మెయిన్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలు మూడు ఒక్కటేనని అన్నారు. ధరణితో రైతులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. ప్రభుత్వ భూములను అధికార పార్టీ కబ్జా చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, గోలి మధుసూదన్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, చేపూరి రవీందర్, అనిత, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నీలగిరిని హరితవనంగా మార్చాలి


మొక్క నాటుతున్న కమిషనర్ రమణాచారి


నల్లగొండ టూటౌన్ : హరితహారం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై నీలగిరిని హరితవనంగా మార్చాలని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి అన్నారు. హరిత శుక్రవారంలో భాగంగా నీలగిరి మున్సిపాలిటీకి చెందిన శేషమ్మగూడెం డంపింగ్ యార్డులో కమిషనర్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలందరూ ప్రతి శుక్రవారం తమ ఇంటి ఆవరణతోపాటు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని కోరారు. కాలుష్యం లేని పర్యావరణాన్ని భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. కుండీలు, కూలర్లతో నీరు లేకుండా చూసుకొని ఫ్రైడే రోజు డ్రై డేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ ఈఈ సత్యనారాయణ, ఏసీపీ నాగిరెడ్డి, డీఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి

మునుగోడు : మండల కేంద్రంలో గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు శుక్రవారం అధికారులు వెళ్లి పరిశీలించారు. అధికారుల పరిశీలన తీరును ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుదారులు సొంత ఇంటి స్థలం, ఓటు హక్కు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి ఇంటి నిర్మాణానికి ఎలాంటి సహాయం పొంది ఉండకూడదని తెలియజేశారు. అలాంటి వారిని మాత్రమే అర్హులుగా గుర్తించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ సుమతల, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన పంచశత మాసోత్సవం


సంకీర్తనలు ఆలపిస్తున్న గాయకురాలు

రామగిరి(నల్లగొండ): శ్రీ అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితి నల్లగొండ ఆధ్వర్యంలో ఆగస్టు 16న ప్రారంభమైన పంచ శత మహోత్సవం ముగిసింది. అన్నమయ్య సంకీర్తన సంగీత సభ శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతికి చెందిన శ్రీ సాయి కామాక్షి మౌనిక అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. వయోలిన్ మహావాది వాసు విశ్వనాథ శాస్త్రి, మృదంగం కందుకూరి అరవింద్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రచార సమితి వ్యవస్థాపకులు డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య, అక్కినేపల్లి మురళీధరరావు, డాక్టర్ సిహెచ్ మల్లికార్జునచారి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో రైతువేదిక వద్ద రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను స్థానిక సర్పంచ్ జేరిపోతుల మంజుల శుక్రవారం ప్రారంభించారు. సింగిల్‌విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు జేరిపోతుల చంద్రమౌళి, బీఆర్‌ఎస్ నాయకులు మామిడి సర్వయ్య, జలేందర్, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై సర్వే

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం పట్టణంలో క్షయ వ్యాధి సర్వే చేసి క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, బాల సైదులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

కనగల్ : విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందు కు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ తరి రాములు అన్నారు. శుక్రవారం మార్తినేనిగూడెం, కురంపల్లి, బుడుమర్లపల్లి ప్రాథమిక పాఠశాలలు, పొనుగోడు ప్రాథమికోన్నత, జి యడవల్లి ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలు తీరు పరిశీలించినట్లు తెలిపారు.

భూమిని పరిరక్షించాలని వినతి

చండూరు : మండలంలోని పుల్లెంల గ్రామ పరిధిలో సర్వే నంబర్ 24లో గల భూమిని పరిరక్షించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర షీప్ అండ్ గోట్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్‌కు హైదరాబాద్‌లో శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో గొర్రెలను మేపేందుకు ఆ భూమిని వినియోగిస్తున్నామని, ఆ భూమిని కొందరు ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకన్న యాదవ్, శివర్ల లింగస్వామి, సైదులు యాదవ్, గుండబోయిన దిలీప్, పాక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కనగల్ : అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలి పారు. మండల పరిధిలోని శేరి లింగోటం గ్రా మ వాగు నుంచి ఇదే గ్రామానికి చెందిన అయితగోని స్వామిగౌడ్ నంబర్ లేని ట్రాలీలో నల్ల గొండ పట్టణానికి ఇసుకను తరలిస్తుండగా లింగోటం స్టేజీ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర పండుగగా గుర్తించాలి

నల్లగొండ టూటౌన్: దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని కోరుతూ యాదవ సంఘం నాయకులు శుక్రవారం మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొబ్బల గోపాలకృష్ణయాదవ్, ఈరటి బాలరాజు యాదవ్, అల్లి వేణుయాదవ్, మామిడి దుర్గాప్రసాద్ యాదవ్, అంబర్ల సత్యనారాయణ యాదవ్, గజ్జి అజయ్‌యాదవ్ ఉన్నారు.

గొప్ప పోరాట యోధుడు సర్వాయి పాపన్న


నకిరేకల్ : తాటికల్‌లో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


నల్లగొండ టౌన్ : పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు


చిట్యాల : సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంజయ్‌దాస్ గౌడ్


గట్టుప్పల్ మండల కేంద్రంలో..


కట్టంగూర్‌లో ..

నల్లగొండ టౌన్ : బహుజన రాజ్యాధికారం కోసం కృషిచేసిన సర్వాయి పాపన్నగౌడ్ గొప్ప పోరాటయోధుడు అని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. శుక్రవారం పాపన్న గౌడ్ 373వ జయంతిని స్థానిక కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ మొగులాయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన గొప్ప వీరుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, బీసీ సంక్షేమ అధికారి ఖాజా నజీం అలీ, అప్సర్, సత్తయ్యగౌడ్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న 373వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తాటికల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్యగౌడ్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నకిరేకల్‌లో గౌడ సంఘం భవనంలో కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్, భూపతి వెంకటనారాయణ, చనగాని రవి, కొండ యాదగిరి, కొండ శ్రీను, రాచకొండ వెంకట్‌గౌడ్, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఓగోడు గ్రామంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరుపుకున్నారు. సర్పంచ్ అబ్బగోని విజయలక్ష్మీ, వెంకట్‌గౌడ్, గోవిందు, బుచ్చిరాములు, మాద రామరాజు, సత్తయ్య పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఆర్‌పీఎస్ అధ్యక్షుడు నూనె వెంకటస్వామి, గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్, గుండాల నరేష్‌గౌడ్, శేపూరి రవీంధర్, గ్యార మారయ్య, చిత్రగంటి ప్రవీణ్, బీఎస్పీ మండల అధ్యక్షుడు గ్యార శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, పొట్లపల్లి రవీందర్‌గౌడ్, రేగులగడ్డ నర్సింహగౌడ్, పొన్నం లక్ష్మయ్యగౌడ్, పంతంగి కరుణాకర్‌గౌడ్, వరికల్ గోపాల్, ఉయ్యాల లింగస్వామి, పల్లె వెంకన్నగౌడ్, బత్తుల ప్రభాకర్‌గౌడ్, ఉయ్యాల వెంకటయ్య, పంతంగి బాలరాజు, జోగు శ్రీకాంత్, చేగూరి సైదులు, అన్వర్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు శుక్రవారం ఈదులూరు, కట్టంగూర్, బొల్లేపల్లి, పరడ గ్రామాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కట్టంగూర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి పెద్దగౌడ్ కొంపెల్లి యాదయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పోగుల నర్సింహ, జనార్దన్, అంతటి శ్రీను, పాడిచేటి సైదులు, ఎర్కల లక్ష్మీ నారాయణ, అంజయ్య, శ్రీను, లింగయ్య, పరమేష్, శేఖర్, వెంకన్న, హరీష్, రామకృష్ణ, రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

చండూరు మండలంలో..

చండూరు : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 జయంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చండూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భీమనపల్లి శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మోగుదాల శేఖర్, బీజేపీ నాయకులు దోటి వెంకటేష్ యాదవ్, 1వ వార్డు కౌన్సిలర్ కోడి వెంకన్న, భూతరాజు దశరథ, పందుల సత్యం, మోగుదాల దశరథ, చిన్న దశరథ మొగుదాల వెంకన్న, సరికొండ వెంకన్న, పందుల వెంకన్న, తాందారి రవి, పాలకూరి శీను, వెంకన్న, ప్రశాంత్, గణపతి, ప్రవీణ్, రాజు, శీను, స్వామి పాల్గొన్నారు.

గట్టుప్పల్ మండలంలో..

చండూరు(గట్టుప్పల్) : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతిని గట్టుప్పల్ మండల కేంద్రంలో గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి గౌడ యువజన సంఘం అధ్యక్షుడు పెద్దగాని రాఘవేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. భీమగాని మల్లేశం, కర్నాటి అబ్బయ్య, బొల్లేపల్లి వెంకటేశం, మాదగాని గోపాల్, భీమగాని యాదయ్య, బోడ శంకరయ్య, శివ, శ్రీను, అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మండల కేంద్రంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు పందుల రాములుగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం మండల అధ్యక్షుడు చెరుకు శ్రీరాములుగౌడ్, మాలమహానాడు మండల అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య, ముత్యాలుగౌడ్, జమ్ముల వెంకటేష్‌గౌడ్, కొంపల్లి నాగరాజు, శ్రీరాములు, యాదయ్య, వెంకట్, అంబళ్ల రవి, సుంకరి మల్లేష్, నర్సింహ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


పూజలో పాల్గొన్న సర్పంచ్ దంపతులు

కనగల్ : మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో మండలవాసులతో పాటు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.3లక్షలతో ధ్వజస్తంభం తొడుగులు చేయించగా జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ కొబ్బరికాయ కొట్టి ఇత్తడి తొడుగులను కమిటీ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ నర్సింగ్ సునితాకృష్ణయ్య, ఆలయ నిర్మాణ దాత ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిట్ల లింగయ్య, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

• శ్రావణమాసం పూజలు


శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా నీలగిరి పట్టణంలోని పలు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాయినాలు ఇచ్చుకున్నారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నల్లగొండ

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

చిట్యాల : చిన్నకాపర్తి, బోయగుబ్బ, మొగిలిదొరి, ఆరేగూడెం గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆయా గ్రామాలకు చెందిన జ్వాలా యువజన సంఘం ప్రతినిధులు శుక్రవారం నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో సీనియర్ అసిస్టెంట్ నర్సింహకు వినతి పత్రం అందజేశారు. యువజన సంఘం ఉపాధ్యక్షుడు పాలిమే నవీన్, కోశాధికారి పెర్క రవి, రాజు, ప్ర కాష్, శ్రీధర్, రామ్‌కుమార్, మహేందర్, ఉమేష్, సాయి పాల్గొన్నారు.

‘సీఎం మాయమాటలు ప్రజలు నమ్మరు’

నకిరేకల్ : సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు వివిధ పథకాలు ప్రవేశపెట్టి మరోమారు అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, కేసీఆర్ మాయ మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని టీపీసీసీ నేత దైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్యారెంటీగా అమలుచేసే పథకాలను తాను ప్రచార కరపత్రాల రూపంలో ప్రజలకు పంపిణీ చేస్తుంటే అపూర్వ స్పందన వస్తోందన్నారు. గార్లపాటి రవీందర్‌రెడ్డి, దేవులపల్లి వెంకన్న, మహ్మద్, సర్వర్ మియా, చింతల శ్రీనివాస్, పోతుల యాదగిరి, వంటిపాక నాగయ్య, జాని, మాజీద్, సుధాకర్, ప్రసాద్, నక్షత్, ముత్యాలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరీదేవిగా దుర్గమ్మ



చిట్యాల : శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు ఒడి బియ్యం పోశారు. అనంతరం నిర్వహించిన గోమాత పూజ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శీలా సత్యనారాయణ, మేనేజర్ అంబటి నాగిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.